22న స్టీల్‌ప్లాంట్ సీఎండీ ఆఫీసు ముట్టడి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 22వ తేదీన స్టీల్‌ప్లాంట్ సీఎండీ ఆఫీస్‌ను ముట్టడి చేస్తున్నట్లు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. బుధవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం మూడున్నర ఏళ్లుగా విక్రయానికి సన్నాహాలు చేస్తూ ఉత్పత్తి కుంటువడే విధంగా కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్టీల్ ప్లాంట్ అధికారులు తీరు బాగో లేదన్నారు. చైర్మన్ సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో రాష్ట్రంలో రాస్తారోకోలు చేస్తామన్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ప్రైవేటీకరణ చేయమని ప్రకటించారని గుర్తు చేశారు. 120 శాతం ఉత్పత్తి సామర్థ్యం వున్నా ఉద్యోగుల హక్కులు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రం, ప్లాంట్ యాజమాన్యం కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రైతులు ఇచ్చిన భూముల్లో ప్లాంట్ నిర్వహిస్తున్నారని, దేశానికే మణిహారం అయిన ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని పోరాటం కొనసాగిస్తారని హెచ్చరించారు. కార్మికుల పొట్ట కొట్టే రీతిలో కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. సిఎండీని ఘెరావ్ చేస్తామన్నారు. ఏడు నుంచి నాలుగు మిలియన్ టన్నులకు ఉత్పత్తి పడిపోయేలా కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. కమిటీ సభ్యుడు వరశాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు విష వాయువులతో సతమతం అవుతున్నారన్నారు. కేంద్రం ముడి సరుకు మీద ఆంక్షలు విధించిందని, జగన్ కేంద్రం మీద ఒత్తిడి తేలేకపోయారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. మీడియా సమావేశంలో పోరాట కమిటీ నాయకులు నీ రుకొండ రామ చంద్రరావు, సురేష్ బాబు, పంచదార్ల ఉగ్రహం తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి

పింఛనుదారూల సంఘం డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ: హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం కళింగనగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిడబ్ల్యుఎస్‌సి పరిష్కరించాలని కోరారు. ఈ నెల 28న మేజర్ పోర్టుల్లో జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ పిపిపి విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పింఛనుదారులందరికీ మెరుగైన వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానంతో పింఛనుదారులు వైద్యంలో ఇబ్బందులను ఎదుర్కొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పులి శివప్రకాశరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నెపు నారాయణరావు, పోర్టు పింఛనుదారులు పాల్గొన్నారు.

ఐఐఎం తాగునీటి పైప్‌లైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: గంభీరంలో ఏర్పాటు చేస్తున్న ఐఐఎం ఇనిస్టిట్యూట్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన భూగర్భ పైప్ లైన్ల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను పూర్తి చేసి తాగునీటిని అందించాలని సూచించారు. ఐఐఎం ఇనిస్టిట్యూట్ కాన్ఫరెన్స్ హాలులో ఈ మేరకు బుధవారం ఉదయం ఆర్.డబ్ల్యు.ఎస్., ఐఐఎం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గోస్తనీ నదిలో బోని నుంచి 12.5 కి.మీ. మేర పైప్ లైన్ ఏర్పాటు చేసి ఐఐఎంకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉందని ఇప్పటి వరకు 6 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయని ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ. తెలిపారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బి విభాగం నుంచి క్లియరెన్స్ వచ్చాక మిగిలిన పనులను పూర్తి చేస్తామని కలెక్టర్‌కు చెప్పారు. ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిని వివరించారు. ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ ఆర్.వి.ఎస్. చౌదరి, ఐఐఎం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన విజయానికి ఎంతో అవసరం

విశాలాంధ్ర - మల్కాపురం: నిర్ణయాలు తీసుకునే శక్తి, సమయపాలన, వృత్తి నైపుణ్యాలు, భాషాపరమైన నైపుణ్యాలు విజయానికి ఎంతో అవసరం అని ఆంధ్ర విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ సర్వసిద్ధి హరనాథ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన నూతన విద్యార్థినుల స్వాగత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నూతనంగా కళాశాలలో చేరిన వారు ముందుగా తమ నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలని అన్నారు. అవకాశాలను సృష్టించుకుంటూ విజయాలను సొంతం చేసుకోవాలని కోరారు. విద్యా సంబంధ విషయాల్లోనే కాకుండా, జాతీయ సేవా పథకంలో, క్రీడలలో, మేధోపరమైన పోటీలలో పాల్గొని ప్రతి విద్యార్థిని తన వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకోవాలని అన్నారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షత వహించగా, కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేత్లీన్, అధ్యాపకులు, సీనియర్ విద్యార్థినులు మాట్లాడారు. అనంతరం ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలోని విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులను అందజేసి అభినందించారు. సమావేశంలో భాగంగా ముఖ్య అతిథి డాక్టర్ సర్వసిద్ధి హరినాథ్‌ను ఘనంగా సత్కరించారు.

అన్న క్యాంటీన్ పథకానికి లక్ష రూపాయలు విరాళం

విశాలాంధ్ర - తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆకలి తీర్చాలని తపనతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ల పథకానికి తన వంతు సాయం చేయాలనే ఉద్దేశంతో తాళ్లవలస గ్రామానికి చెందిన దాట్ల సూర్య అప్పలరాజు రూ.లక్ష రూపాయల విరాళం అందించారు. భీమిలి జీవీఎంసీ జోనల్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావుకు అందించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ తన భార్య దాట్ల అమ్మాజమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళం అందిస్తున్నారని తెలియజేశారు. భీమిలి జోన్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణకై ఈ సొమ్మును వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా తన వంతు సహాయ సహకారాలు త్వరలో అందిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఫైళ్ళ పరిష్కారంలో జాప్యం వద్దు: ఎంసీ విశ్వనాథన్

విశాలాంధ్ర - విశాఖ : లే అవుట్ దరఖాస్తుదారులను ఆఫీస్ చుట్టు పదేపదే తిప్పకుండా ఫైళ్ళను పరిష్కరించాలని వీఎంఆర్డీఏ ఎంసీ కె.ఎస్. విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో ప్రణాళికా విభాగంపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫైళ్ళను పరిష్కరించడంలో కాలయాపన చేస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. ఎటువంటి జాప్యం లేకుండా ఫైళ్ళను పరిష్కరించాలని అన్నారు. ప్రణాళికా విభాగం ఉద్యోగుల ఈ - ఆఫీస్ వ్యక్తిగత వ్యక్తిగత లాగిన్ లో పెండింగ్ ఫైల్స్ స్టేటస్ ను పరిశీలించి, వివరణ అడిగారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ అఫిడవిట్ లను సకాలంలో దాఖలు చేయాలన్నారు. పాత దస్త్రాలను స్కానింగ్ చేసి రికార్డు రూమ్ లో భద్రపరచాలని ఆదేశించారు. సంస్థకు చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకొనే విషయంలో వెనకాడబోనని హెచ్చరించారు. పని తీరు మార్చుకొని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి డి.కీర్తి, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, వీకేపీసీపీఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్ప, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక "మండల లీగల్ సర్వీస్ కమిటీ" ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ వారు ఉచిత కంటి పరీక్షలు పెదగంట్యాడ నెల్లిముక్కు రామాలయం ప్రాంగణంలో నిర్వహించారు. డాక్టర్ ఏ.రామచంద్ర రెడ్డి, డాక్టర్ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ జి.చికిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి పరీక్ష క్యాంపులో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పరీక్షలు చేయించుకున్న వారికే కాక కుటుంబ సభ్యులకు కూడా ఫ్రీ కూపన్స్ జారీ చేశారు. ఈ ఫ్రీ కూపన్లతో గాజువాక వాసన్ ఐ కేర్ హాస్పిటల్ నందు ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పురోగతి పెంచాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షల మేరకు జిల్లాలో నిర్మిస్తున్న గృహాల ప్రగతి భారీగా పెరగాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ లేఅవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణాలు, వాటి పురోగతిపై బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఇతర అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. వలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన లేఅవుట్ల తాజా పరిస్థితిని ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 100 రోజుల్లో 71 వేల గృహాలు స్టేజ్ అప్డేషన్ జరగాలని ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు తీవ్ర కృషి చేయాలని ఆదేశించినప్పటికీ పనుల్లో పురోగతి లేదన్నారు. ఇచ్చిన లక్ష్యానికి ఇంకా 14 వారాలు సమయం ఉన్నందున ప్రతి వారం 5 వేల గృహాలు స్టేజ్ అప్డేషన్ కావాల్సిందేనని కలెక్టర్ తేల్చిచెప్పారు. గుత్తేదారులకు ఎటువంటి బకాయిలు లేనందున వారితో మాట్లాడి త్వరితగతిన పనులు చేయించాల్సిన బాధ్యత గృహ నిర్మాణ శాఖ అధికారులదేనని అన్నారు. పనిచేయని గుత్తేదారులకు తక్షణమే నోటీసులు జారీచేసి, పనులు ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇసుక, సిమెంట్ సరఫరాకు సంబంధించి సంబంధిత అధికారులకు చెబుతానని గృహ నిర్మాణ శాఖ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఈఈ సత్య నారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్య ప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్యప్రకాశ రావు, ఇతర ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ చిల్డ్రన్ పార్కు పనుల ఆలస్యంపై జీవీఎంసీ కమిషనర్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్ 2, 12వ వార్డు ముడసర్లోవ ప్రాంతంలో నిర్మితమవుతున్న చిల్డ్రన్ పార్క్ పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. బుధవారం ఆయన ముడసర్లోవ చిల్డ్రన్ పార్క్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో కమిషనర్ ముడసర్లోవ పాత నర్సరీ ప్రాంతంలో చేపట్టిన చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులను పరిశీలించి, పార్కు నిర్మాణం కోసం మంజూరు చేసిన పనులను ఆలస్యం చేయడంపై ఆరా తీస్తూ, పనులు ఆలస్యం చేయడం వలన సమయం వృధా కావడమే కాకుండా ఆర్థిక నష్టం కూడా జీవీఎంసీకి కలుగుతుందని ఇంజినీరింగ్ అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులో ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా నిర్మాణాలు చేపట్టాలని, కొన్నిచోట్ల నిర్మాణాలకు అడ్డంగా ఉన్న చెట్లను మరొక చోటుకు ట్రీ ట్రాన్స్ లోకేషన్ చేయాలన్నారు. పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్, చిల్డ్రన్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్, 15 సంవత్సరాల పిల్లల వరకు కావలసిన అన్ని ఆట పరికరాలు, టాయిలెట్లు, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ముడుసర్లోవ ప్రాంతంలో పిల్లల కోసం ప్రత్యేకంగా కల్పిస్తున్న సుమారు 7 ఎకరాల గల ఈ స్థలంలో పార్కును అందంగా తీర్చిదిద్ది, అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని పర్యవేక్షక ఇంజినీరు శాంసన్ రాజుకు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, 2వ జోనల్ కమిషనర్ శైలజ వల్లి, కార్యనిర్వాహక ఇంజినీరు శాంతిరాజ్, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షమై ప్రజాగళం విప్పండి

భీమిలి నియోజకవర్గం ప్రజాప్రతినిధులతో వైసీపీ అధినేత జగన్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రజా సమస్యలపై, కూటమి ప్రభుత్వ హామీల అమలు కోసం ప్రజాపక్షమై ప్రజా గళం విప్పాలని వైసీపీ ప్రజాప్రతినిధులకు ఆ పార్టీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గం ప్రజా ప్రతినిధులతో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి వైసిపి పార్టీ కార్యాలయంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులతో జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ గత 5ఏళ్ళు కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా ఎలాంటి వివక్ష లేకుండా పైసా లంచం లేకుండా, సచివాలయం వాలంటీర్ల ద్వారా గడప గడపకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పాలన అందివ్వడం జరిగిందని, చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలు ఇవ్వడంతో ప్రజలు వాటికి ఆశపడి ఓటు వేసి గెలిపించడం జరిగిందన్నారు. ఎన్నికలు ముందు ఏవైతే సూపర్ సిక్స్ అన్నారో, గెలిచాక ఆ సూపర్ సిక్స్ కాస్త డెడ్ బాల్ అయిందని, నాకు అబద్దాలు చెప్పడం రాదని, మాటిస్తే పాటించడం మాత్రమే తెలుసున్నారు. భయంకర కరోనా మహమ్మారి సమయంలో కూడా మాటిచ్చిన విదంగా పథకాలు అమలు చేసామని, ఓటమి ఏవిదంగా సంభవించినా దానికి కృంగిపోకుండా రాబోయే విజయమే లక్ష్యంగా 5ఏళ్ళు ప్రజలు పక్షాన నిలబడి టీడీపీ ప్రభుత్వ పాలనలో నెరవేర్చని హామీలను ప్రజలు దృష్టికి తీసుకొని వెళ్ళడమే కాక ప్రజా పక్షాన నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భాగంగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి సుమాంజలి ఘటించి జోహార్ వైయస్ఆర్ జై జగన్ అంటూ నినాదాలతో వైసిపి శ్రేణులు హోరెత్తించారు. అనంతరం అవంతి పేరు పేరునా ప్రతీ ఒక్కరిని జగన్‌కి పరిచయం చేశారు. ఈ సమావేశంలో భీమిలి నియోజకవర్గం వైసీపీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

25 వేల అడుగుల జాతీయ పతాక ర్యాలీలో గంటా పిలుపు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్వాతంత్ర్య ఫలాలను అందించిన మహనీయులను స్మరించుకుని నివాళులు అర్పించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సమర యోధుల త్యాగాలను నేటి యువత తెలుసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో బుధవారం సెంట్రల్ పార్కు సమీపంలోని మహిళా కళాశాల వద్ద 25 వేల అడుగుల భారీ జాతీయ పతాక ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని అందిపుచ్చుకుని జాతీయ సమైక్యతను పెంపొందించే దిశగా స్టూడెంట్స్ యునైటెడ్ నెట్ వర్క్ విద్యార్థులతో జాతీయ పతాక ర్యాలీ నిర్వహించడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశ జాతీయ పతాకాన్ని రూప కల్పన చేసే అవకాశం తెలుగు వారైన పింగళి వెంకయ్యకు రావడం తెలుగు వారందరికీ గర్వ కారణమన్నారు. పతాకంపై ఉండే కాషాయం త్యాగానికి, స్వచ్ఛతకు, తెలుపు సత్యానికి, శాంతికి, ఆకుపచ్చ ప్రకృతికి చిహ్నాలు కాగా, 24 ఆకులున్న అశోక చక్రం ధర్మ పాలనకు ప్రతిబింబమని పేర్కొన్నారు. జెండా ఊంఛ రహే హమారా పేరుతో చేపట్టిన ర్యాలీకి ముందు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ఫోటోకు గంటా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, చిక్కాల విజయ్ బాబు, స్టూడెంట్స్ యునైటెడ్ నెట్ వర్క్ అధ్యక్షుడు బసవ కృష్ణమూర్తి, సుంకరి రమణమూర్తి, విశ్రాంత పోలీస్ అధికారి సి.మురళి నాయుడు, సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, బీజేపీ నాయకుడు కొప్పుల రాంజీ, రాజగిరి విఠల్, ట్రాఫిక్ ఏసీపీ ఎస్.వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీని అన్ని విధాలా ఆదుకుంటున్న ప్రధాని మోదీ

విశాలాంధ్ర - పెందుర్తి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విదాలా ఆదుకుంటోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన విభజన విభిషిక సంస్మరణ దివస్ కార్యక్రమం ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో బుధవారం పెందుర్తిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, బిజెపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి పరమేశ్వరరావు, ఉపాధ్యక్షులు వనుం సత్యన్నారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కరక దేముడు, రెడ్డి నారాయణరావు, జనసేన నాయకులు గొర్లె అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశవిభజన సమయంలో పాకిస్తానీయులు సాగించిన మారణకాండను నిరసిస్తూ ఏటా ఆగస్టు 14న బిజెపి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఆనాడు మహిళల మానప్రాణాలను హరించడంతో పాటు ఆస్తులను కొల్లగొట్టారని గుర్తు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే లక్ష్యంగా అనేక దుశ్చర్యలకు పాల్పడ్డారని వెల్లడించారు. గత పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేవిదంగా పాలన సాగిస్తోందని తెలిపారు. గత ఐదేళ్లలో అన్నివిధాలా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో పాటుపడుతున్నారని వారికి ప్రదాని మోదీ పూర్తి సహాయ సహకారాలందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ బోర్డు మాయం విశాలాంధ్ర దినపత్రికలో బుధవారం వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలో పాలవలస రెవెన్యూ సర్వే నెంబర్ 54/6లో మండల తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలంలో విఆర్ఓ శ్రీనివాస్, వీఆర్ఏలు బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ప్రతీ దాతకు వందనాలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యాన్న ప్రసాదం 36వ వసంతంలోకి ప్రవేశించిన సందర్భంగా దాతలకు పేరు పేరునా ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం నిత్యాన్నదాన భవనంలో సింహాద్రి నాథుని చిత్ర పటానికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిదప భక్తులకు ఈఓ దంపతులు ప్రత్యేక వంటకాలతో భోజనాలు వడ్డించారు. అనంతరం ఈఓ విలేకరులతో మాట్లాడుతూ త్వరలో 500 మంది భక్తులు కూర్చుని భోజనాలు చేసేందుకు వీలుగా మరో భవనాన్ని ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. స్వామివారిని దర్శించుకునే భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు.

బొత్సను కలసిన బెహరా

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఉమ్మడి విశాఖ వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను వైసీపీ మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. బెహర మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తామని బొత్సతో అన్నారు.

బహిరంగ వేలం ద్వారా రూ.కోటి ఆదాయం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి స్వామివారి ఖజానాకు బహిరంగ వేలంద్వారా రూ.1,00, 93,499/-లు ఆదాయం లభించింది. సిల్డ్ టెండర్ ద్వారా సామానులు భద్రపరచుటకు రూ.30,09,999/-లు, సెల్ ఫోన్లు భద్ర పరచుటకు సెల్ ఫోన్ ఒక్కింటికి రూ.10, ల్యాప్ టాప్ రూ.50లుగా దేవస్థానం నిర్ణయించింది. అందుకు బహిరంగ వేలంలో రూ.69, 50,000/-, టీ, కాఫి మిషన్లు పెట్టుకొనుటకు రూ.22,500/-, 35,000/-, 48,000/-, 28,000/- లు ప్రథమ ధరావత్తుగా నిలిచాయి.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: చినగదిలి పరిధిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం ఉదయం గోదాముల వద్దకు వెళ్లిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీళ్లను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలను పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ అధికారులు, ఎలక్షన్ సెల్ అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు ఏఐటీయూసీ ఆహ్వానం

విశాలాంధ్ర - గాజువాక: ఉక్కు నగరంలో సెప్టెంబర్ 1 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఏఐటీయూసీ జాతీయ సమితి ప్రారంభ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి,, జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జే.అచ్యుతరావు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. బుధవారం గాజువాక టిడిపి కార్యాలయంలో జిల్లా ఏఐటీయూసీ నేతలు ఎమ్మెల్యేను కలిసారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరిస్తున్నారు. పల్లా శ్రీనివాసరావును కలిసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.ఎస్ జే.అచ్యుత రావు, కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, రెహమాన్, జె డి నాయుడు ఉన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - మధురవాడ: ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను తెలియజెప్పడానికి, ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కలిగించడానికి గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ (నార్త్) బి.సునిల్ ముఖ్య అతిథిగా హజరై ర్యాగింగ్ నిరోధానికి నిర్దేశించిన చట్టాలను విద్యార్థులకు వివరించారు. విద్యా సంస్థలలో విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు, పోటీ వాతావరణం ఉండాలని ర్యాగింగ్ వంటి విష సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. పిఎమ్‌పాలెం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ ,డాక్టర్ ఎస్.పి.రావు, గీతం ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ టి.వి.నాగరాజు, గీతం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమణరావు, మెడికల్ విద్యార్థులు తరితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు.

17న మిలీనియం మరో క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ మరో భారీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టింది. ఈ నెల 17న భార్గో ఇన్నోవేషన్స్ అనే ప్రముఖ సంస్థతో కలిసి డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం పోస్టర్ కుడా అవిష్కరించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోసం ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. 'మాంద్యం రోజుల్లో కూడా ప్లేస్‌మెంట్ చూపించడం, విద్యార్థుల్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. 17వ తేదీ నాటి డ్రైవ్‌లో కనీసం 50 ప్లేస్‌మెంట్ కల్పించే ధ్యేయంతో పనిచేస్తున్నా మన్నారు. మెకానికల్ విద్యార్థుల కోసం గత వారం డ్రైవ్ నిర్వహించగా, 97మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ పొందారని గుర్తు చేశారు. 24ఏళ్ల నుంచి తమ సంస్థ జాబ్ మేళాలు/క్యాంపస్ డ్రైవ్ లు నిర్వహిస్తూ వస్తోందని, అలా ఇప్పటి వరకు 1.5లక్షల మంది ప్లేస్‌మెంట్ పొందారన్నారు. 2023- 2024మధ్య 60శాతం బీటెక్ (సీఎస్ఈ), సీ పైథాన్, .నెట్ ఫ్రేమ్ వర్క్, హెచ్ టీఎంఎల్, సీఎస్ఎస్/జావా స్క్రిప్ట్ కోర్సుల్లో నైపుణ్యం ఉన్న ఇతర బీటెక్ గ్రాడ్యుయేట్లు ఈ డ్రైవ్‌కు అర్హులని మిలీనియం హెచ్‌ఆర్ మేనేజర్ బి.రమ్యశ్రీ అన్నారు. విశాఖ పరిధిలో భార్గో అనే సంస్థ ఒక ప్రముఖ ఐటీ, బిజినెస్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారంతా 17న నేరుగా మిలీనియం క్యాంపస్‌కి రావచ్చని, లేదా hr@millenniumsoftsol.com తమ రెజ్యూమెను పంపవచ్చని కోరారు. ఈ డ్రైవ్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం www.millenniumsoftsol.com అనే వెబ్ సైట్‌ను సందర్శించ వచ్చని, 9248753098 ఫోన్ నంబర్‌లో మాట్లాడవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ ఆర్ ప్రతినిధి హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చెయ్యాలని జీవిఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రజలకు పిలుపునిచ్చారు. 95వ వార్డు పురుషోత్తపురం నియర్ హౌసింగ్ బోర్డ్ కొలనీలో కొలువై ఉన్న శ్రీ గౌరీ విశ్వేశ్వర ఆలయం ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముమ్మన దేముడు అక్కడ తన చేతులు మీదుగా మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావితరాల మనుగడకు మొక్కలను నాటి పెంచాల్సిన అవసరం ఎతైనా ఉన్నదని, పచ్చదనం పెంపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోరాడ చందు యాదవ్, కోలని ప్రతినిధులు పీవి.రమణమూర్తి, వై.సత్య నారాయణ, యమ్.కేశవరావు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - పెందుర్తి: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని పెందుర్తి నియోజకవర్గం బిజెపి కన్వీనర్ గొర్లె రామునాయుడు ఉద్బోధించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి నుంచి 100 మీటర్ల జాతీయ జెండాతో కైట్స్ స్కిల్ డెవలప్మెంట్, ఆదర్శ్ డిగ్రీ కాలేజీ, బాలాజీ విద్యాసంస్థ, మహాత్మా గాంధీ నర్సింగ్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం నినాదంతో వీధుల్లో తిరిగిన విద్యార్థులు స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాము నాయుడు మాట్లా డుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందింపచేయాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్గాలు, మతాలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. భారతదేశ విభజన జరిగిన రోజుల్లో దేశంలో చోటుచేసుకున్న దురాగతాలను ఆయన గుర్తు చేస్తూ, దేశం కోసం ప్రతీ ఒక్కరూ ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కస్టమ్స్ కమిషనర్‌ను అభినందించిన ఐడిజెఎన్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐకి) జీఎస్టీ విశాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.ఆనంద్ కుమార్ ఐఆర్ఎస్‌ను ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్వర్క్ విశాఖ చాప్టర్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎస్టీ కమిషనర్ ఆనంద్ కుమార్‌ను దుశ్శాలువతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో ఆదాయ పన్నుల శాఖ కీలకమని అన్నారు. పన్నుల చెల్లింపులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తద్వారా ప్రభుత్వానికి సక్రమంగా పన్నులు చెల్లించే విధంగా చేస్తామని అన్నారు. ఆయనను కలిసిన వారిలో ఐడిజెఎన్ రాష్ట్ర అధ్యక్షులు తంగేటి నానాజీ (నాని), రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మధు, సీనియర్ జర్నలిస్టులు ఐడిజేఎన్ విశాఖ చాప్టర్ సభ్యులు, ఏపీయూడబ్ల్యుజే ఉపాధ్యక్షులు కె.చంద్రమోహన్, ప్రకాష్, జార్జ్, ఆంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ బీఓబీ బ్యాంకులో పాము కలకలం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్లపూడి బ్రాంచిలో బుధవారం పాము కలకలం సృష్టించింది. బ్యాంకు రికార్డు రూములో పాము చొరబడింది. బ్యాంకు సిబ్బంది పామును చూసి హడలి పోయారు. స్నేక్ క్యాచర్ కిరణ్‌కు బ్యాంకు సిబ్బంది సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి పామును పట్టుకున్నాడు. అనంతరం ఊరికి దూరంగా వదిలి వేశాడు. పాములు చూస్తే భయపడకుండా సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

వేంకటాద్రిపై వైభవంగా శ్రీనివాసుని కళ్యాణం

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వెంకటాద్రి క్షేత్రంలో బుధవారం చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామనుజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ముందుగా మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. కొంతమంది భక్తులు స్వామివారికి తులాబారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

డాక్టర్ రవిరాజ్ పేరుతో నెఫ్రాలజీ ప్రసంగం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర ప్రదేశ్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ (ఏపీఎస్ఎన్) వార్షిక సమావేశంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ టీ.రవిరాజు గౌరవార్థం నేఫరాలజీ సదస్సులో ఆయన పేరుతో వార్షిక సమావేశం ప్రారంభించారు. 2015లో ప్రారంభించబడిన ఈ సదస్సుకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా డాక్టర్ రవి రాజు పనిచేయడంతో పాటు ఉమ్మడి ఏపీలో జీవందాన్ (అవయవ మార్పిడి కార్యక్రమం) స్థాపించడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. తిరుపతిలో నిర్వహించబడిన ఏపీ ఎస్ఎన్ వార్షిక సమావేశంలో ప్రారంభ ప్రసంగాన్ని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జార్జ్ అబ్రహం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 200 మంది నెఫ్రాలజిస్టులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ హాజరయ్యారు.

గొట్టిపల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో 78 మీటర్ల జాతీయ జెండాతో హైస్కూల్ విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామ కార్యదర్శి సురేష్ బాబు, హైస్కూల్ ఇన్చార్జి హెచ్‌ఎం అప్పారావు, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడు బాబు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు డబ్బీరు విజయ్ కుమార్, కోరాడ తమ్ము నాయుడు, నాయకులు ఎర్ర బంగారు నాయుడు (బన్నీ), సుంకరి శివ, దొంతల శ్రీరామ్, గొలగాని రమణ, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలస: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా భీమిలి బీచ్ రోడ్డులో గల స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహం అయిన మహాత్మా గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం బిజేపి కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, బిజేపి 3వ వార్డు అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, టిడిపి నాయకులు కనకల అప్పలనాయుడు, బిజేపి నాయకులు పొలుబోతు విజయ, చెన్నా రాము తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో ఇన్నోవేషన్ ప్రయోగశాల

విశాలాంధ్ర - ఆనందపురం: నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం నూతనంగా అత్యాధునిక వసతులతో

కూడిన టెక్నాలజీ ఇన్నోవాషన్ ప్రయోగశాలని జె.ఎన్.టి.యు, జి.వి, విజయనగరం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజ్య లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉద్దేశిస్తూ కాన్సెప్చ్యువల్ లెర్నింగ్, ఇన్నోవాటివ్ థింకింగ్ అంశాలను భవిష్యత్తులో ఈ లేబరేటరీ సహాయం తో ప్రయోగాత్మక ఆవిష్కరణలు చెయ్యాలని ప్రతిఒక్కరూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ ప్రయోగశాల ప్రారంభోత్సవం సందర్భంగా కళాశాల కార్యదర్శి డా. ఎన్.ప్రసాద్ రాజు, కోశాధికారి ఎన్.కనకరాజు, ప్రిన్సిపాల్ డా. ఎస్.శంభు ప్రసాద్ విభాగాధిపతులు, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

యొకోమా పరిశ్రమకు 52 మంది ఎంపిక

విశాలంధ్ర - అచ్యుతాపురం: స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో యొకోమా పరిశ్రమ వారు బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 86 మంది మహిళలు హాజరవగా 52 మంది ఎంపికైనట్లు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి మదు తెలిపారు. యొకోమా ప్రతినిధులు శ్రవణ కుమార్, బాలాజిలు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులను ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

జనావాసాల మధ్య మొబైల్ టవర్ ఏర్పాటు చేయొద్దు

వినతులు ఇచ్చినా స్పందించని మున్సిపల్ యంత్రాంగం
నిరాటంకంగా నిర్మాణ పనులు చేస్తున్న టెలికాం సంస్థ

విశాలాంధ్ర - పీఎం పాలెం: జనావాసాల మధ్య మొబైల్ టవర్‌లు ఏర్పాటు వల్ల వాటి నుంచి వెలువడే రేడియేషన్ ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని ఎన్నో అధ్యయనాలు నిరూపిస్తున్నప్పటికీ టెలికాం సంస్థలు తమ వాణిజ్య ప్రయోజనాలే పరమావధిగా భావిస్తూ జనావాసాల మధ్యే మొబైల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం వారు అడిగిందే తడవుగా జనావాసాల మధ్య వాటి ఏర్పాటుకు అనుమతులు క్షణాల్లో మంజూరు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అంతేకాదు వాటి ఏర్పాటుపై ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నా వాటిని పెడచెవిన పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. నగరంలోని పి.ఎం.పాలెం ప్రాంతంలోని బింద్రానగర్‌లోని షిప్‌యార్డు లేఅవుట్‌లో ఇటీవల ఒక ప్రముఖ టెలికాం సంస్థ మొబైల్ టవర్ ఏర్పాటుకు మునిసిపల్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. అనుమతి ఇచ్చిన ప్రదేశం చుట్టూ పలు అపార్ట్‌మెంట్‌లు, నివాసాలు వున్నాయి. జనావాసాలకు కనీస దూరం లేకుండా టవర్ల ఏర్పాటుపై చుట్టూ వున్న బింద్రానగర్, ధర్మపురి కాలనీ వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ యంత్రాంగం టవర్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చే ముందు కనీసం ఆ ప్రాంతంలో ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోకుండా ఎలా అనుమతులు మంజూరు చేశారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విషయమై వారం రోజుల క్రితం మధురవాడ జోనల్ కమిషనర్‌ను కలసి వినతిపత్రం అందించగా ఆమె మూడు రోజుల్లో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తానని కాలనీ వాసుల ప్రతినిధి బృందానికి తెలియజేశారని ఇప్పటివరకూ ఆమె దీనిపై స్పందించలేదని ఈ కాలనీ వాసి అయిన ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వి.సి. ప్రొ.రాజేంద్రప్రసాద్ అన్నారు. మరోవైపు టెలికాం సంస్థ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో ముమ్మరంగా టవర్ ఏర్పాటు పనులు చేస్తోంది. రెండు మూడు రోజుల్లో జి.వి.ఎం.సి. అధికారులు స్పందించి ఈ టవర్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దుచేయని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని కాలనీ వాసులు స్పష్టం చేస్తున్నారు.

ఎండాడ చెరువును పరిశీలించిన జివిఎంసి కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగర పరిధిలోని నీటి కొలనులలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టేందుకు డ్రోన్స్ స్ప్రేయింగ్ యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన రెండవ జోన్ పరిధిలోని ఎండాడ చెరువులో దోమలు వృద్ధి చెందకుండా మలేరియా లార్వల్ ఆయిల్ (ఎం.ఎల్. ఆయిల్) ను డ్రోన్ల ద్వారా వెదజల్లే ప్రక్రియను, అలాగే సమీపంలో ఉన్న రెడ్యూస్ రిసైకిల్ రియూజ్ (ఆర్.ఆర్.ఆర్) సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపడం చేపట్టేందుకు డ్రోన్స్ స్ప్రేయింగ్ యంత్రాల సహకారం అవసరమని, నీటి కొలనులలో దోమలు లార్వల్ ను అరికట్టేందుకు డ్రోన్ల సహకారంతో స్ప్రేయింగ్ చేసేందుకు వీలుగా నగరంలో గల కిసాన్ డ్రోన్స్ స్ప్రేయింగ్ సర్వీస్ వారు తీసుకు వచ్చిన డ్రోన్స్ పనితీరును స్వయంగా పరిశీలించడమైనదన్నారు. ఈ డ్రోన్స్ ద్వారా నీటి కొలనులలోనే కాకుండా పిచికారీ చేయడానికి వీలులేని ప్రాంతాల్లో వీటి ద్వారా స్ప్రేయింగ్ చేయించి దోమల వృద్ధిని అరికట్టవచ్చునన్నారు. ఎండాడ చెరువులో వర్షపు నీరు చేరేందుకు వీలుగా సమీపంలోనున్న కల్వర్ట్ లను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని, చెరువును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం సమీపంలో ఉన్న త్రిబుల్ ఆర్ సెంటర్ ను పరిశీలించి ప్రజల వినియోగానికి, పిల్లల ఆటవస్తులకు పనికిరాని వస్తువులతో తయారుచేసిన బొమ్మలు మొదలైనవి ఉండే విధంగా నిర్వహణ చేపట్టాలని జోనల్ కమిషనర్ శైలజ వల్లి ను కమిషనర్ ఆదేశించారు. ఎండాడ త్రిబుల్ ఆర్ సెంటర్ అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలానికి రక్షణ గోడను వెంటనే నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఆ స్థలం వద్ద వున్న అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమీషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎ.ఎం.ఒ.హెచ్. సురేష్, టి.పి.ఒ. విశ్వనాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన రౌతు శ్రీను బ్రదర్స్

విశాలాంధ్ర - ఆనందపురం: తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డిని భీమిలి మాజీ శాసన సభ్యులు అవంతి చొరవతో మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీడైరెక్టర్ రౌతు శ్రీను సోదరులు మర్యాద పూర్వకంగా కలిసి చిత్ర పటాన్ని అందించారు. పార్టీ కోసం చేసిన సేవ, ప్రతి కార్యకర్త పార్టీ కి సేవ కోసం వివరించి, పలు సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లగా వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటానని సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నందిష్ ఉన్నారు.

సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' షార్ట్‌లిస్ట్‌లో 'హమారా ల్యాబ్స్' బృందం

విశాలాంధ్ర- విశాఖపట్నం: సామ్‌సంగ్ ఇండియా తన ఫ్లాగ్‌షిప్ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రోగ్రామ్ 'సాల్వ్ ఫర్ టుమారో' 2024 కోసం టాప్ 20 టీమ్‌ల జాతీయ షార్ట్‌లిస్ట్‌ను ఈరోజు ప్రకటించింది. షార్ట్‌లిస్ట్ లో నగరానికి చెందిన 'హమారా ల్యాబ్స్'బృందం కూడా ఉంది. ఈ కార్యక్రమం 3వ ఎడిషన్‌లో, విద్యా ర్థులు తమ ఆలోచనలను 'కమ్యూనిటీ మరియు ఇన్‌క్లూజన్' మరియు 'పర్యావరణం సుస్థిరత' అనే రెండు అంశాల క్రింద సమర్పించారనీ సామ్‌సంగ్ సౌత్ వెస్ట్ ఏషియా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్పీ చున్ అన్నారు. స్కూల్ ట్రాక్‌లోని దాదాపు 20 శాతం ఆలో చనలు విద్య, వెనుకబడిన సమూహాలకు వనరులకు యాక్సెస్, అనుభవపూర్వక అభ్యాసం, డిజిటల్ అక్షరాస్యత చుట్టూ ఉన్న సవాళ్లకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారించాయి. యూత్ ట్రాక్‌లోని దాదాపు 25 శాతం ఆలోచనలు నీటి సంరక్షణ, ఆర్సెనిక్ కాలుష్యం, నీటి వృధా, నదీ పరీవాహక ప్రాంతాల చుట్టూ ఉన్న పర్యావరణ అసమతుల్యత సమస్యల చుట్టూ తిరిగాయి.

మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ - ఎం జి విండ్సర్

విశాలాంధ్ర - విశాఖపట్నం : జేఎస్డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తమ రాబోయే వాహనం భారతదేశపు మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ - ఎం జి విండ్సర్ యొక్క కొత్త టీజర్ ను విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటనలు తెలిపారు. ఈ టీజర్ విభాగంలో తొలిసారి సమర్పించిన ఏరో-లౌంజ్ సీట్ల యొక్క ఇటీవలి వెల్లడింపు తరువాత విడుదలైంన్నారు.ఇది ఇప్పటికే విభాగంలో సౌకర్యం మరియు విలాసాల కోసం కొత్త ప్రామాణాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఆధునిక ఫీచర్స్ కలయిక ఈ టీజర్ విభాగంలో తొలిసారి సమర్పించిన ఏరో-లౌంజ్ సీట్ల యొక్క ఇటీవలి వెల్లడింపు తరువాత విడుదలైందన్నారు. ఈ ఆధునిక ఫీచర్స్ కలయిక ఎం జి విండ్సర్ ను భారతదేశపు వినియోగదారుల కోసం ఎం జి విండ్సర్ ను ఒక ప్రత్యేకమైన ఎంపికగా చేసిందన్నారు ప్రతి వివరానికి చూపించబడిన శ్రద్ధ ప్రపంచంలోనే ఈ అతి ఎక్కువగా ఆక్రమించబడిన కోటకు మరొక హాల్ మార్క్ గా నిలిచిందన్నారు. ఎం జి విండ్సర్ ఈ శ్రేష్టతను ప్రతిబింబిస్తోందన్నారు. విండ్సర్ కోటలో ఉంచిన అదే స్థాయి ఆధికృత మరియు విలాసాన్ని చూపించేలా కారులో ప్రతి అంశం ఖచ్చితంగా రూపొందించబడిందని నిర్ధారిస్తుందన్నారు.

మట్టిలో మాణిక్యం 'కొసన'

విశాలాంధ్ర - తగరపువలస: స్థానిక చిప్పాడ గ్రామానికి చెందిన కొసన ఆదిలక్ష్మి జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలలో విశేష ప్రతిభను కనబరిచింది. ఆదిలక్ష్మి చిప్పాడ గవర్నమెంట్ స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. ఆమె తండ్రి కొసన చిట్టిబాబు. ఆయన చిన్నప్పుడే మరణించారు. ఆమె తల్లి కొసన రామ సంతోషి టిఫిన్ సెంటర్ నడుపుకొని పిల్లలతో జీవిస్తున్నారు. ఆమె తల్లి సహకారంతో, కోచ్ వాసుపల్లి ఆదినారాయణ ప్రోత్సాహంతో వివిధ టోర్నమెంట్ లలో పాల్గొనడం జరిగింది. జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలు (బీబీఎఫ్) భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ తరుపున ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు హర్యానాలో జరిగిన పోటీలలో ఆమె బ్రాంజ్ మెడల్ సాధించింది. సెప్టెంబర్ నెలలో ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రతిభను గుర్తించి సన్ స్కూల్ సంస్థల అధినేత కైతపల్లి శ్రీనివాసరావు ఆమెను అభినందిస్తూ 10,000 (పదివేల రూపాయిలు) నగదు బహుమతిని ఆమెను ప్రోత్సాహిస్తూ బహుకరించారు. అలాగే సన్ స్కూల్ సంస్థలకు సంబంధించిన ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ స్కూల్ నుంచి ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని కుష్మిత కుడా బ్రాంజ్ మెడల్ సాధించింది. ఆ అమ్మాయిని కూడా సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు.

షిప్ యార్డ్ కాలనీలో ముగిసిన క్రీడలు

విశాలాంధ్ర - మల్కాపురం: హిందూస్తాన్ షిప్ యార్డ్ స్పోర్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో షిప్ యార్డ్ కాలనీలో గత పది రోజులనుండి జరుగుతున్న క్రీడల పోటీలు ముగిసాయి. ఈ పోటీలలో ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు. వాలీబాల్, క్రికెట్,

బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, కార్రోమ్స్ జరిగాయి. వాలీబాల్ లో డిజైన్ టీం, క్రికెట్ లో వార్ ఆన్ టెర్రర్ టీం విజేతలుగా నిలిచారు. విజేతల కు బహుమతులు అందజేయుటకు ముఖ్య అతిధి గా సంస్థ డైరెక్టర్ (స్ట్రేటజిక్ ప్రాజెక్ట్) గిరిదీప్ సింగ్ హాజరు అయ్యారు. విజేతలకు బహుమతులు అందజేస్తూ ప్రస్తుత సమాజంలో ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఉల్లాసానికి క్రీడలు ప్రతీ రోజు ఒక గంట ఖచ్చితంగా ఆడాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో కంపెనీ సెక్రటరీ ఐనయతుల్లా బేగ్ మరియు ఉన్నంతధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల జీతాలు చెల్లించాలి



విశాలాంధ్ర - పెదగంట్యాడ : ఆగస్టు పదిహేను, భారత దేశ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్టీలు ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలని ఉక్కు ఏఐటీయూసీ కార్మిక నాయకుడు యేల్లేటి శ్రీనివాసరావు ఉక్కు యాజమాన్యన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగులు, కార్మికుల వేతనాలు విషయం లో అలసత్వం ప్రదర్శిస్తుందని, కేంద్రానికి చెల్లిస్తున్న జిఎస్టి విషయం లో ఉన్న శ్రద్ధ ఉక్కు ఉత్పత్తికై శ్రమిస్తున్న కార్మికుల విషయం లో ఆలోచన లేక పోవడం విచారకరమన్నారు. గత 14 రోజులుగా యువ ఉద్యోగులు ఐక్యంగా తాలి బచావో పేరుతొ ఉక్కు పరిపాలన విభాగం ముందు నిరసన తెలియ జేస్తున్నారని, ఒప్పంద కార్మికులకు గడిచిన మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికీ స్వాతంత్రం వచ్చిన ఈరోజు కూడ ఉక్కు కార్మికులను పస్తులు పెట్టడం స్టీల్ ప్లాంట్ యాజమాన్యనికి తగదని తక్షణమే పూర్తి జీతాలు చెల్లించలని ఉక్కు కార్మిక నాయకుడు యేల్లేటి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు.